క్లుప్తంగా

నూతన డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభం



బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని సిక్కుల బస్తీలో డ్రైనేజీ సమస్యతో బస్తీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు శనివారం స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి నూతన పైపులైన్ పనులను ప్రారంభించారు. డ్రైనేజీ పనులను నాణ్యతా ప్రమాణాలతో, త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావలని సూచించారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ అనిల్ కుమార్, బస్తీ అధ్యక్షుడు అమర్‌సింగ్ పాల్గొన్నారు.

'తెలంగాణలో కాంగ్రెస్‌కే పట్టం'



టీపీసీసీ కార్యదర్శి సూరజ్ తివారీ

బాలానగర్: తెలంగాణ రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని, మోదీ ప్రభుత్వం ఒకే దేశం – ఒకే ఎన్నిక పేరుతో జమిలి ఎన్నికలకు వెళ్లటం అనేది ఇండియా కూటమికి వస్తున్న ఆదరణను చూసేనని టీపీసీసీ కార్యదర్శి సూరజ్ తవారీ అన్నారు. గ్యాస్ సిలిండర్ ధరను 200 రూపాయలను తగ్గించటం అనేది కూటమిని చూసే గ్యాస్ ధరలు తగ్గించారని అన్నారు. 28 పార్టీల కలయికతో ఏర్పడిన కూటమికే రాబోయే ఎన్నికల్లో గెలుపు అని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధి నందమూరి నగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం అర్ధరాత్రి స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అదే విధంగా నిజాంపేట రోడ్డు రాఘవరెడ్డి ఫంక్షన్ హాలు వద్ద నెలకొన్న మంజీర పైపులైన్ లీకేజీ పనులను తనఖీ చేసి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదర్ నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీ వాసులు నాగ వర ప్రసాద్, అంజయ్య, కోటిరెడ్డి, శ్రీనివాసరావు, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

కాలనీవాసులతో కార్పొరేటర్ సమావేశం



కాలనీ వాసులతో సమావేశమైన కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని ఏవీబీ పురం కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులతో శనివారం కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో అన్ని పనులు పూర్తి చేసుకున్నామని, రోడ్డు నెంబర్ 3లోని భూగర్భ డ్రైనేజీ పనులు మొదలు పెట్టడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ధరమ్‌సింగ్, ఆదినారాయణ, రమణారావు, వాసు, సింహాద్రి, లక్ష్మణ, రాజు, వెంకట్రావు పాల్గొన్నారు.

సంధ్య టెక్నోవన్‌లో 40 శాతం కార్యకలాపాలు

గచ్చిబౌలి: సంధ్య టెక్నోవన్‌లో స్థలం కొనుగోలు చేసిన వారంతా ఒకతాటి పైకి వచ్చి పనులు పూర్తి చేసుకుంటున్నామని యజమానులు స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలో ప్రస్తుతం 40 శాతం కార్యకలాపాలు కొనసాగుతున్నాయని, పలు సంస్థలు కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నాయని వారు వివరించారు. టెక్నోవన్‌లో స్థలాలు కొనుగోలు చేసిన యజమానులు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంధ్య టెక్నోవన్ మీద గత కొన్ని రోజులుగా వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, కొనుగోలుదారుల ఆధ్వర్యంలోనే నిర్మాణ పనులన్నింటినీ పూర్తి చేసుకున్నామన్నారు. సమావేశంలో భవన నిర్మాణ సమన్వయకర్త కమాండర్ హరీష్ నాయని, కొనుగోలుదారులు నిరంజన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డబుల్ ఇళ్ల పంపిణీలో రాజకీయ జోక్యం లేదు

– మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



పోలీసులతో వాగ్వావాదానికి దిగిన దరఖాస్తుదారులు



ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మాధవరం కష్ణారావు, హైదరాబాద్ కలెక్టర్ అమోయ్ కుమార్

సుభాష్‌నగర్: సీఎం కేసీఆర్ ప్రభుత్వం పేద మధ్యతరగతి ప్రజల కోసం నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లను రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. డబుల్ ఇళ్ల మొదటి విడత పంపిణీకి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బహదూర్ పల్లి వేదికైంది. శనివారం జరిగిన కార్యక్రమంలో కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, సనత్ నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల చెందిన 1700 మంది లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీకి శ్రీకారం చుట్టారు. డబల్ బెడ్ రూమ్ ఇళ్లను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణారావు, హైదరాబాద్ కలెక్టర్ అమోయ్ కుమార్‌లతో కలిసి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..కేసీఆర్ ప్రభుత్వం పేద మధ్యతరగతి ప్రజల కోసం దేశ చరిత్రలో మొదటిసారిగా నగరంలో పదివేల కోట్లతో లక్ష డబల్ బెడ్ రూమ్ కట్టాలని లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటికే 69,532 కట్టించిందన్నారు. మొదటి విడతగా నగరంలో 11,700 ఇళ్లను పంపిణీ చేసిందని, మిగతా 58 వేల ఇళ్లను విడతలవారీగా 12 వేల చొప్పున ఆరుసార్లు పంపిణీ చేస్తుందని తెలిపారు. మొదటి విడతలో రానివారికి మిగతా విడుతలో వస్తుందని ఆందోళన చెందవద్దని సూచించారు.

గందరగోళం

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు ప్రసంగిస్తున్న సమయంలో కొంతమంది మహిళలు ఆందోళనకు దిగారు. దీంతో ఐదు నిమిషాల పాటు గందరగోళ పరిస్థితి నెలకొంది.

మాజీ ఎమ్మెల్యే కూనను అదుపులోకి...

డబల్ బెడ్ రూమ్ పంపిణీ వేదిక వద్దక నిరసన చేసేందుకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ను జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ వెంకట్ రెడ్డి అడ్డుకున్నారు. స్థానికంగా వేల సంఖ్యలో దరఖాస్తులు రాగా కేవలం 500 మాత్రమే పంపిణీ చేయడం ఏమిటని కూన ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ, సీపీఎం నాయకులు కీలుకాని లక్ష్మణ్, ఉమా మహేష్‌లు ఆందోళనకు దిగగా వారిని అరెస్టు చేసి పిఎస్‌కు తరలించారు.

సొంతింటి కల నెరవేరింది



నగరంలో సొంతింటిలో ఉంటాం అనుకోలేదు. కేసీఆర్ వల్ల మాకు సొంతిల్లు వచ్చింది. ప్రతినెలా కట్టే అద్దె రూ.6000 మిగిలినట్టే. ఇక సంతోషంగా జీవితం గడుపుతాం.
– గంగా లక్ష్మి, గాజులరామారం.

ధైర్యం వచ్చింది



భర్త చనిపోయాడు. కూలినాలి చేస్తూ పిల్లలను చదివిస్తున్నా. చేసిన కష్టంలో సగం మేర ఇంటి అద్దెకే పోయేది. ఇకనుండి ఆ దిగులు లేదు. కెసిఆర్ రుణం తీర్చుకుంటా.
– కుమారి, సుభాష్ నగర్.



హాజరైన లబ్ధిదారులు



ఆందోళన చేస్తున్న దరఖాస్తుదారులు

గురువందనం - ఛాత్రాభినందనం...



కూకట్‌పల్లి: భారత వికాస్ పరిషత్ తెలంగాణ ప్రాంతం ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలోని పిఎస్ఎం స్కూలులోని ఇందిరా చంద్ర శేఖర్ ఆడిటోరియంలో శనివారం గురువందనం – ఛాత్రాభినందనం కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భారతవికాస్ పరిషత్ తెలంగాణ ప్రాంతంలోని 18 శాఖలచే ఎంపికచేయబడిన విశేష కృషి చేసిన ఉత్తమ గురువులకు, ఉత్తమ శిష్యులకు అభినందన కార్యక్రమం, రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో సత్కరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ లాంటి ఉత్తమ శిష్యులను తీర్చిదిద్దిన బ్రహ్మశ్రీ వేలేటి మృత్యుంజయ శర్మ, చిత్రలేఖన గురువులు మరగంటి కులశేఖరాచార్యులు, అవధాన రంగంలో విశేష కృషి చేస్తున్న మారుమాముల దత్తాత్రేయ శర్మ, యోగా శిక్షకులు బండి ఉష, లలిత సంగీత గురువులు బి. ఉదయకుమార్‌లను సత్కరించారు. కార్యక్రమంలో అశ్విని అధినేత సుబ్బారావు, వివేకానందన సేవా సమితి చైర్మన్ హనుమంతరావు పాల్గొన్నారు.



సందడిగా 'డబుల్' ఇళ్ల పంపిణీ



కూకట్‌పల్లి నియోజవర్గ లబ్ధిదారులకు పంపిణీ చేసిన దుండిగల్‌లోని రెండు పడకల ఇళ్ల సముదాయం

కూకట్‌పల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రెండు పడకల ఇళ్ల పంపిణీ కార్యక్రమం దుండిగల్‌లో అత్యంత వైభవంగా జరిగింది. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి మంతి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, వివేకానంద గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి ఎంపికైన 500 మంది లబ్ధిదారులకు నివాస ధృవపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ 60 ఏళ్లగా ఏ పార్టీ చేయనటువంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలిపారని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఈ విధంగా రెండు పడకల గదుల ఇళ్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. నిరుపేద ఆడబిడ్డ పెళ్లయితే కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, గర్భవతి అయి ఆసుపత్రిలో చేరితే కేసీఆర్ కిట్ వంటి అనేక సంక్షేమ పథకాలను నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిలుస్తున్నారని అన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరిస్తున్నాం



వర్షపు నీటి నాలాను ప్రారంభించిన కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ తదితరులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని పలు ప్రాంతాలలో వర్షపునీరు నిలిచి ప్రజలు పడుతున్న తీవ్ర ఇబ్బందులకు గుర్తించి ప్రజల కష్టాలు తీర్చామని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. శనివారం సిండికేట్ బ్యాంక్ కాలనీ నుంచి మల్లికార్జుననగర్ రోడ్డు నంబర్ 3 వరకు కోటి 50 లక్షల రూపాయలతో నిర్మించిన బాక్స్ టైప్ నాలాను కార్పొరేటర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షకాలంలో సిండికేట్ బ్యాంక్ కాలనీ, మల్లికార్జుననగర్, కళింగ ఎన్‌క్లేవ్, ఆర్ఆర్‌నగర్, అలీ కాంప్లెక్స్, మనసా సరోవర్ ప్రాంతాలలో వర్షపు నీరు నిలిచిపోయి ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసిన ఎమ్మెల్యే కోట్లాది రూపాయల నిధులను వెచ్చించి ఈ నాలాలను నిర్మాణం చేయించామన్నారు. డివిజన్ అధ్యక్షుడు ఇర్ఫాన్, ప్రధాన కార్యదర్శి మేకల హరినాథ్, మహిళ అధ్యక్షురాలు లలిత పాల్గొన్నారు.



ఉత్సాహంగా లైవ్‌వెల్ మారథాన్



కూకట్‌పల్లి: హైదర్‌నగర్‌లో చిన్నారులు తల్లిదండ్రులతో కలిసి లైవ్‌వెల్ మారథాన్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రస్తుత జీవితంలో చిన్నపిల్లల్లో వస్తున్న మానసిక రుగ్మతలను పారద్రోలేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతి వంద మందిలో పదిమందికి పైగా చిన్నారులు వివిధ మానసిక రుగ్మతలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారు కూడా సమాజంలో మంచి జీవితం గడిపేందుకు వైద్యులు, తల్లిదండ్రులు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. చిన్నారులు, తల్లిదండ్రులు లైవ్‌వెల్ రిమాబిలేషన్ నెట్‌వర్క్ నిర్వాహకులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకున్న కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్‌నగర్, మొగులమ్మ కాలనీ, రాజీవ్‌గాంధీ నగర్ కాలనీల్లో జీహెచ్‌యంసి అధికారులు, స్థానికులతో కలిసి శనివారం స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాదయాత్ర చేపట్టారు. ఇంటింటికి వెళ్లి స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో ఇప్పటికే అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేశామన్నారు. కాలనీల్లో కొంత మేర పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులు కూడా త్వరగా పూర్తి చేస్తామని అన్నారు. అధికారులతో పాటు యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, నాయకులు కాశీనాద్ యాదవ్, గుడ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బలం, బలగం

రాష్ట్ర నాయకులు రఘునాథ్‌యాదవ్

రాయదుర్గం: అభివృద్ధి చేస్తామని మాటిస్తే టీఆర్ఎస్ పార్టీకి రెండుసార్లు అవకాశం ఇచ్చామని, అభివృద్ధిని విస్మరించిన ఆ పార్టీపై ఈసారి తిరగబడాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రఘునాథ్‌యాదవ్ పేర్కొన్నారు. నానక్‌రాంగూడలో 10వ రోజు శనివారం గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని జేబీఎంకాలనీ, రజకనగర్, ముదిరాజ్‌బస్తీ, లోధీబస్తీ, కుమ్మరివాడ, పుకట్‌బస్తీలలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బలం, బలగమన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని మరోసారి స్వాగతించేందుకు ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఈశ్వర్, ముత్యంరెడ్డి, నర్సింహగౌడ్, గఫూర్, రాములుగౌడ్, మునవర్‌పాషా, సహదేవ్, నరేష్‌రాజు, సంజీవరెడ్డి, కుమార్, చిన్ననర్సింహ, ఫిరోజ్, మునీర్, వినోద్ పాల్గొన్నారు.



మంత్రి హరీష్‌రావుకు వినతి

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర హోంగార్డుల సమస్యలపై మంత్రి హరీష్‌రావుకు వినతిపత్రాన్ని అందించామని సైబరాబాద్ హోంగార్డుల సంఘం అధ్యక్షుడు అశోక్‌కుమార్ శనివారం తెలిపారు. హోంగార్డులను పర్మినెంట్ చేయాలని కోరామన్నారు. గతంలో ఉద్యమ సమయంలో హామీ ఇచ్చారని తెలిపారు. పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హోంగార్డుల సంఘం ప్రతినిధులు తాహెర్ మహ్మద్, రావు మహేందర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్ నగర్, జనప్రియనగర్‌లలో శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు ఇంటింటికీ తిరుగుతూ ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అల్లాపూర్ డివిజన్‌లో జరిగిన అభివృద్ధి గురించి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో ఇప్పటికే సీసీ రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సరఫరా, వీధి దీపాలు, ట్రాన్స్‌ఫార్మర్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి, నాగుల సత్యం పాల్గొన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు



కేపీహెచ్‌బీకాలనీ రమ్యాగ్రౌండ్స్ లో...



బాలాజీనగర్‌లో..



రాజేశ్వరి అనాథ ఆశ్రమంలో..



పండిట్ నెహ్రూ నగర్‌లో..

మహానేతకు ఘన నివాళి

కూకట్‌పల్లి: కేపీ హెచ్‌బీ కాలనీ రమ్యాగ్రౌండ్స్‌లో శనివారం గాలిరెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి, దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా వైయస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి సభ్యుడు శివరాం రెడ్డి, మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి, బీజేపీ నాయకులు ముమ్మారెడ్డి ప్రేమకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ చేసిన పలు సేవా కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, తులసి రెడ్డి, కోటిరెడ్డి, కచ్చిన్, రామ్‌రెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నివాళులు అర్పించిన కాంగ్రెస్ నాయకులు...

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంగళరావు, డా. సత్యం శ్రీరంగంలో బాలాజీనగర్‌లోని వైయస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గూడెపు నాగరాజు, సునీల్ యాదవ్, ప్రవీణ్, తూము వేణు, ప్రకాష్ ముదిరాజ్, మహేష్ గౌడ్, నయీం, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ గ్రౌండ్‌లో...

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలో శనివారం వైయస్ఆర్ అభిమానులు దేవిరెడ్డి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం వైయస్ఆర్ వర్ధంతి నిర్వహించారు. పోచమ్మ గ్రౌండ్‌లో వైయస్ఆర్‌చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో, సాయి కృపహోమ్‌లో విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు.



పోచమ్మ గ్రౌండ్‌లో..